సాక్షి విశాఖ సిటీ | శుక్రవారం | మే | 26 | 2017

# ఐఐఎం తొలి స్నాతకోత్సవం నేడు

## పట్టాలు అందుకోనున్న 47మంది విద్యార్థులు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): రాష్ట్ర విభజన అనంతరం విశాఖ కేంద్రంగా ఏర్పడిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ తొలిబ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం నేడు నగరంలో జరగనుంది. మధ్యాహ్నం 2.45 నుంచి 4 గంటల వరకు నోవాటెల్ హోటల్‌లో వేడుకలు నిర్వహించనున్నారు. తొలి బ్యాచ్‌లో ప్రవేశం సాధించిన 47 మంది విద్యార్థులు పట్టభద్రులుగా యోగ్యతా పత్రాలను స్వీకరించనున్నారు. తొలిబ్యాచ్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన వారికి, ఆల్‌రౌండర్‌గా నిలచిన వారికి ప్రత్యేక ప్రశంసా పత్రాలను ప్రదానం చేయనున్నారు. కార్యక్రమానికి ఐఐఎం విశాఖ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ హరి ఎస్ భార్టియా ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవ ప్రసంగం ఇవ్వనున్నారు. విశాఖ ఐఐఎం సంచాలకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్ విశిష్ట ప్రసంగం అందిస్తారు. తొలిసారిగా ఏర్పాటైన జాతీయ విద్యాసంస్థ తొలి స్నాతకోత్సవంలో యోగ్యతా పత్రాలను అందుకోవడానికి విద్యార్థులు ఉవ్విళ్లూరుతున్నారు. దీనిలో భాగంగా ఐఐఎం ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

**అపూర్వ ఆదరణ :** తొలి బ్యాచ్‌లో 47 మంది విద్యార్థులు చేరగా ఇప్పటికే 41 మంది ఉపాధి అవకాశాలు సాధించారు. మిగిలిన ఆరుగురు సైతం త్వరలో మంచి అవకాశాలను అందుకోనున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆశ్రయం ఇచ్చిన ఐఐఎం విశాఖ తొలి బ్యాచ్‌లో ఊహించిన దానికంటే ఎక్కువగా విద్యార్థుల ఆదరణ చూరగొంది. క్యాంపస్ శాశ్వత నిర్మాణం ఇంకా కొలిక్కి రావలసి ఉంది. ప్రస్తుతానికి భీమిలిలో ఐఐఎంకు కేటాయించిన స్థలంలో ప్రహారీ నిర్మాణం తుదిదశకు వస్తోంది. త్వరలో టెండర్లు పిలిచి అధునాతన క్యాంపస్ నిర్మించాల్సి ఉంది. ఇవన్నీ పూర్తి కావడానికి మరో నాలుగేళ్లు సమయం పట్టవచ్చు. కేంద్రం అందించే నిధులు అంతంత మాత్రంగా ఉండటం, ప్రత్యేకమైన కోర్సుల నిర్వహణకు అనువైన పరిస్థితులు లేకపోవడంతో ఆర్థిక వనరులు కొంత అవరోధంగా మారుతున్నాయి. క్యాంపస్ నిర్మాణం పూర్తయితే ఐఐఎం విశాఖకు తలమానికం కాగలదని పలువురు అభిలషిస్తున్నారు.



తొలి బ్యాచ్ విద్యార్థులు

### ఎంతో నేర్చుకున్నా



ఐఐఎంలో చదువుకున్న సమయంలో ఎంతో నేర్చుకున్నాను. ఈ నాలెడ్జ్ ఇంటర్న్‌షిప్ సమయంలో ఎంతో ఉపకరించింది. ఎంతో ఛాలెంజింగ్‌గా సాగింది.

– ప్రియాంక మెహతా

### మేధావుల గైడెన్స్ ఉపకరించింది



విశాఖపట్నంలో మా బ్యాచే మొదటిది కావడంతో చాలా టెన్షన్ పడ్డాం. ఇక్కడికి వచ్చాక చాలా ఆనందంగా అనిపించింది. కోర్సులో చేరిన మొదటి రోజే ఇక్కడ నా జర్నీ సంతోషంగా సాగుతుంది అనే సంకేతాలు కనిపించాయి. అనుకున్నట్లే అంతా హ్యాపీగా, సిస్టమేటిక్‌గా గడిచింది. దేశంలోనే ప్రముఖ మేధావుల మార్గదర్శకత్వం నాకెంతో ఉపకరించింది.

– శ్రీనిధి.ఎస్